

జ్యేష్ఠ

సునంద (మా బుచ్చికక్కి కూతురు) రెండ్రోజులు మా ఇంట్లోగడిపి వెళ్ళింది. చిన్నప్పుడు కలిసి పెరగడాన అది మా ఇంటికి రావడం మాకెంతో ఇష్టం. రెండ్రోజులు అయ్యాక అది వెళ్ళిపోవడం మరీ ఇష్టం! క్షణం విశ్రాంతి లేకుండా చేసేస్తోంది. మనుషులు తట్టుకోలేరు దాని చపలత్వమూ, అల్లరినీ. దానికి అన్నలు లేరేమో నేనే అన్న హోదాలో దానికి అన్ని అచ్చట్లూ ముచ్చట్లూ తీరుస్తున్నాను. కొంచెం ఖర్చు కష్టమైనా మా ఆవిడ పట్టుపట్టి ఏడాదికి రెండుసార్లు చీర పెట్టడంవగైరా లాంఛనాలన్నీ చేయిస్తుంది. నేను ఈ రోజుల్లో ఈ పిచ్చి ఆచారాలూ, మర్యాదలూ ఎందుకు వసంతా, నీది మరీ పురాణ యుగం అంటే మా ఆవిడ పురాణమో చాదస్తమో, అన్నల సొమ్ము తీపి ఆడదానికి వుంటుందండీ... మీ కర్థంకాదు అనేస్తుంది. నేను అప్పోసొప్పో చేసి అన్నీ ఆవిడ చెప్పినట్లు చేస్తాను.

సునందకి నేనంటే వెర్రి ఆపేక్ష. వసంత ఎస్సెల్సీ వరకే చదివిందనీ, నాకు తగ్గభార్య కాదనీ పెళ్ళిన అనేసింది చిన్న. నాకు రెండు డిగ్రీలు, ఒక ఇండియన్ డాక్టరేటు, ఒకఫారిన్ డాక్టరేట్ వున్నమాట నిజమే. వసంతకి డిగ్రీలు లేవని నేనేనాడు బాధపడలేదు. డిగ్రీలు వృత్తికోసం. అవి ఎలా బతకాలో చెప్పవు. బ్రతుకు చదువురీసెర్చ్ నేర్పేరు. అది కాలేజీల్లో నెయ్యరూ... చెప్పరూ. బియ్యే చదివావు తేలు మంత్రం కూడా రాదా అని చాలామంది ఆలోచించినట్లే సునంద కూడా డిగ్రీలతో మనుషులకి ఏదో కొత్త తెలివి వస్తుందనుకుంటుంది. అందుకే అది పెళ్ళై ఇద్దరు పిల్లల్ని కనికూడా ఎమ్మె పరీక్షకి చదువుతూ మొగుడ్ని నానా బాధ పెడుతోంది. (సూర్యారావుకి ఇష్టంలేదు కనుక బాధ)

నిన్నరాత్రి నేనూ సునందా భోజనాలుచేసి పిధి గదిలో సోఫాల్లో కాళ్ళు జాపుకుని కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుతున్నాం. వసంత వంటింట్లో భోజనం చేస్తోంది. సునంద, వసంత స్వయంగా తనే తెప్పించి ఫ్రిజ్‌లో వుంచిన కిళ్లీ నములుతూ — అన్నా నువ్వెంతో గొప్పవాడివి అని దండకం చదివింది. నాకు ఈ పొగడ్తలు కొత్తకాదు. అంచేత రేపటి క్లాసుకోసం రాసిన నోట్సు తిరగేస్తూ దాని మాటలు వింటున్నాను. అలా పది నిమిషాలు మాట్లాడేకా నేను వింటంలేదేమోనని అనుమానం వచ్చి అలిగింది సునంద. నువ్వే నీ నా మాటలు వింటంలేదన్నా. నీకంటే ఒదినే మంచి. నీకు గొప్ప డిగ్రీలున్నాయని, నేనింకా ఎమ్మె పూర్తి చేయలేదని నీకు గొప్పబడాయి అనేసరికి ఉలిక్కిపడి లేచి నవ్వాను నేను. "అన్నీ వింటున్నా తల్లీ. నువ్వు గొంతుకలో మైక్‌తో పుట్టావు. నీ మాటలు ఎలా తప్పించుకుంటాననుకున్నావు" అని నేనంటే అదీ నవ్వేసింది.

సౌమనస్యంగా అది "కాదన్నయ్యా నువ్వింత గొప్ప చదువులు చదివావు గదా. ఒదిన కూడా చదువుకుని వుంటే ఎంత బాగుండేది. అదొక్కటే అన్నయ్యా" ... అంది సునంద.. ఒక్క క్షణం నాకు మతిపోయింది.

మనుషులు ఆలోచించరు. ఎంతో ఆలోచించి, ఎన్నో అసాధ్యాలు సాధించాకా నాకే నమ్మకం కుదిరింది. నా పెళ్లాం చదువుకోక పోవడం వల్ల నేనేదో బాధపడుతున్నానని 'అనుకుంది' సునంద. శాస్త్రీయ దృక్పథం వున్నవాళ్ళు ఆ అనుకోవాన్నే పరమసత్యంగా భావించరు. ఆ 'అనుకోడం' ఆధారంగా విషయ సేకరణ చేస్తారు. ఆ విషయ సేకరణలో మొట్టమొదట చేయాల్సింది నేను తను అనుకున్నట్లుగా బాధ పడుతున్నానా లేదా అని అడిగికనుక్కోవడం, ఆ పని కూడా ఎప్పుడూ చెయ్యలేదు సునంద. అంత చనువు నాతో వుంది కదా అడిగిందా నన్ను? ఉహూ. సునందే కాదు. దాదాపు అందరూ అంతే. అదే కాబోలు అహంభావం అంటే. అలాంటి అనుకోడాల్నే ఖచ్చితమైన సూత్రాలుగా అందరికీ అందిస్తారు. పెద్దవాళ్ళు పిల్లలకీ, మేష్టర్లు విద్యార్థులకీ, మొగుళ్ళు పెళ్లాలు ఒకరొకరికీ, మత గురువులు తనను నమ్మిన వాళ్లకి, హేతువాదులు తనని నమ్మని వాళ్లకి ఇలా బోధ చేస్తూ వుంటారు. విన్నవాళ్ల ఖర్మ వాటిని సీరియస్‌గా తీసుకుంటే...

అంచేత నేను సునంద అనుకోని జోక్ని జోక్‌గానే తీసుకున్నాను. సరిగ్గా అదే సమయంలో మా దగ్గరికి రాబోతున్న వసంత గిరుక్కున తిరిగి వెనక్కి వెళ్లిపోవడం కూడా నా కంటబడింది. వసంత అలా వెళ్లిపోవడం సునంద కోసమే. సునంద వసంత అక్కడ లేదనే ధైర్యంతోనే కదా అలా మాట్లాడింది. తన మాటలు వసంత విందని తెలిసి ఆ పిల్ల ఖంగారుపడి సిగ్గుతో కృంగిపోవడం ఇష్టంలేకనే మా ఆవిడ అలా నేర్పుగా ఆ ఇబ్బంది రాకుండా చేసింది.

ఆ దంపతుల చర్చ...
ఇండియా విదేశాంగ విధానాన్నిదాటి, అరబ్ దేశాల స్త్రీల సమస్యల్ని తడిమి, ఫ్రాన్స్ న్యూక్లియర్ నైపుణ్యాన్ని ఛేదించి, అమెరికాలో యువతరం అశాంతి దగ్గర ఆగింది.

సునంద మర్నాడు వెళ్లిపోతుంది. కనుక మేం రాత్రి ఒంటిగంటదాకా బాతాఖానీ వేశాం. సునంద తన మొగుడి గురించీ, అత్తమామలు, ఆడబడుచుల గురించీ అనేక చాడీలు చెప్పింది. నేను ఎటూ చెప్పకుండా అది చిన్నబుచ్చుకోకుండా వుండేందుకు మధ్య మధ్యఅర్థంలేని రిమార్కులు ఏవోచేస్తూ విన్నాను. మన బాధలు ఎవరితోనైనా చెప్పకుంటే కొంత ఊరట వస్తుంది. ఎటొచ్చీ అవతలివాళ్లు ఆ భావాల కానుకని భద్రంగా దాచుకుంటే మన శనిని వాళ్లకి పులిమినట్లవుతుంది. (అందుకే రోగుల భావాన్ని తలకెక్కించుకున్న ఫలితంగా అమెరికాలో ఆత్మహత్యలూ, తాగుడూ మామూలు జనంలో కంటే మానసిక వైద్య

ల్లోనే ఎక్కువట) దానికి అర్థం అయ్యేలా చెప్పడం నావల్ల అయ్యేపని కాదు. ఈ తప్పు చెయ్యకూడదు. ఆ తప్పు చేయకూడదు అని నీతులు చెప్పి తప్పుల్ని తప్పించుకునే అవగాహనా, శక్తీ ఇవ్వకపోడం క్రూరం. ఆ పనే ఇన్ని శతాబ్దాలుగా మతమూ సంస్కర్తలూ చేపి చేసి మానవజాతిని హింస పెట్టారు. సునందని సంస్కరించే బాధ్యత అదీ అవసరం అని అతను అనుకుంటే దాని భర్తది. ఇంకెవరూ ఆ పని చెయ్యలేరు.

సునందకి పిల్లల గదిలో గుడ్‌నైట్ చెప్పి మా పడగ్గదిలోకి వెళ్లేసరికి వసంత పడక్కుర్చీలో కూర్చుని ఇర్వింగ్ వాలెస్ నవల "ఫాన్‌మన్ రిపోర్టు" చదువుతోంది. నిద్ర వస్తున్నా ఆపుకుంటూ... ఇర్వింగ్ వాలెస్ అంటే ఆమెకి మహా పిచ్చి. నాకంటే వాలెస్ అంటేనే ఎక్కువ ప్రేమ నీకు అని ఉడికిస్తుంటాను ఆమెని.

నన్ను చూసి పుస్తకం పక్కన పెట్టి చేతులు చాచింది వసంత. పక్క కుర్చీ ముందు కూర్చున్నాను. నా తల తన ఒళ్లోకి లాక్కుని తల, మెడ నిమురుతూ బద్ధకంగా "బుజ్జాయీ, ఇంత సేపు నిద్ర చెడగొట్టుకుంటే ఎలగయ్యా. రేపు పొద్దునే స్టూడెంట్లకి స్పెషల్ క్లాస్ పెట్టానన్నావు కూడాను" అంది. నేను రెండు క్షణాలు అలా నిద్రపోయి, లేచి నిలబడి ఆమెను లేవదీశాను. కావలించుకునే మంచంమీదకు తీసుకెళ్లాను, పడుకున్నాం. క్షణంలో ఒళ్లు తెలీని నిద్ర పట్టేసింది.

ఆ మర్నాడు సునందను స్కూటర్ మీద తీసుకెళ్లి బస్టాండ్‌లో వదిలేసి కాలేజీకి వెళ్లిపోయాను.

సాయంత్రం నేను ఇంటికొచ్చాక యోగాసనాలు టి.ఎం. కలిసి చేసి టిఫిన్ తిని నేనూ వసంతా పిల్లలూ బీచ్ కెళ్లాం. పిల్లలు కెరటాలతో దాగుడుమూతలాడుతున్నారు. నేను వసంతా చూస్తూ ఇసకలో కూర్చున్నాం.

నేను బియ్యే ప్రైవేట్‌గా చదువుతా. సన్నగా అంది వసంత.

నిన్న సునంద అన్నమాటల ఎఫెక్ట్! సాభిప్రాయంగా వసంత కళ్లలోకి చూశాను. తనభావం నాకు తెలుసని తనకి తెలుసని నాకు తెలిసిందని తెలిసి సిగ్గుతో వసంత మొహం ఎర్రగా కందిపోయింది. పెళ్లామైనా సరే బీచ్‌లో ముద్దెట్టుకోకూడదు. కనుక ఎలాగో ఆ తీవ్రవాంఛని అణిచిపెట్టి వసంత వాలిన కళ్లని చూసి తృప్తిపడుతూ వున్న డిగ్రీలు చాలవా డాక్టరుగారికి అన్నాను.

వసంతకి ఎస్సెల్సీ అవగానే పెళ్ళయ్యింది. పెళ్లి కావడం ఆడపిల్లలకి మరో జీవితంలోకి అడుగు పెట్టడం కనుక మొగుడు "ఇంటర్మీడియట్" అయ్యాడు. ఆమెకి మా పెద్దబ్బాయి పుట్టడం బియ్యే డిగ్రీ! మూడో వాడితో డాక్టరేట్ వచ్చింది! చదువు ఆపేసింది అక్కడికి.

"మీ చెల్లాయి బాధపడుతోంది నేను మీకు తగ్గదాన్ని కానని, నాకు డిగ్రీలుంటే బాగుండేదని"


"కాలేజీ డిగ్రీలు వుండడంలో నష్టంలేదు. నువ్వూ ఉద్యోగం చేస్తావా? ఉద్యోగాలు కావాలంటే డిగ్రీ తెచ్చుకో!"

"మీరు మరీ వేళాకోళం. సురేష్, రామసీతా కలిసి కాలేజీలో చదువుకున్నారు. కలిసి ఉద్యోగం చేస్తున్నారు. అందుకే వాళ్లది ఆదర్శ దాంపత్యం అయ్యింది. చిలకా గోరింకల్లా ఉన్నారని మీ చెల్లాయి చెప్పింది. ఆవిడే కాదు మీ చుట్టాల్లో అందరూ అదేమాట. అంత ముచ్చటైన జంట ఎక్కడా వుండదని సునంద వున్న రెండ్రోజుల్లోనూ పదిసార్లయినా చెప్పింది."

"అవును నాతోను చెప్పింది— వాళ్లు చిలకా గోరింకల్లా వున్నారని. వాళ్లు ఒకే చదువు, ఒకే భావాలు, ఒకే ఉద్యోగం, ఒకే అభిరుచులు వున్న వాళ్లని. అయితే చిలకా చిలకా కాని గోరింకా గోరింకా కాని అవుతారు తప్ప చిలకాగోరింకా ఎలా అవుతారని నేనంటే "నీకర్థం కాదంది" సునంద. దానికి వాళ్లంటే "హీరో వర్‌షిప్" అన్నాను.

భోజనం వడ్డించి వున్నది తినకుండా ఇద్దరూ ఏదో తీవ్రంగా వాదిస్తున్నారు. నన్ను ఆప్యాయంగా ఆహ్వానించారు ఇద్దరూ. ఓ నిముషం కుశలప్రశ్నలు అయ్యాక మళ్లీ వాదన కొనసాగించారు.

వాళ్ల వాదన చూస్తే నాకు ముచ్చటేసింది. వాళ్ల మాటలు చైనీస్ ఛాంపియన్స్ కొడుతున్న పింగ్ పాంగ్ బంతిలా ఇటూ అటూ ఎగురుకుంటూ రావడం చూస్తే నాకు వాళ్ల పరిజ్ఞానం ఎంత ఎక్కువో తెలిసింది. రష్యా చైనాల దెబ్బలాట గురించి అప్పులు చర్చ. అది ఇండియా విదేశాంగ విధానాన్ని దాటి, అరబ్ దేశాల స్త్రీల సమస్యల్ని తడిమి, ఫ్రాన్స్ న్యూక్లియర్ వైపు గ్యాన్ని ఛేదించి, అమెరికాలో యువతరం అశాంతి దగ్గరకు వాలింది. మధ్యలో వాళ్లిద్దరూ నేను జడ్జినీ, తాము లాయర్లు అన్నట్లు కొంచెం నా తీర్పు కోసం ఆగినట్టు నటించారు. మళ్లీ రెండో రౌండ్. రష్యా చైనాల దెబ్బలాట గురించే ఈసారి హిందూ మతంలో మూఢనమ్మకాలూ, క్రైస్తవ మతంలోవున్న మూడు వందల శాఖలూ, కాశీలో శవాలగతీ, హిందూ మహా సముద్రంలో నేవల పెంపకం, ద్రవ్యోల్బణం, డాలర్ పతనం, స్మగ్లింగ్ ఇలా సాగింది.



సురేష్ మా పెద్దక్క కొడుకు. చిన్నప్పుడు వాడికి పుస్తకాల పురుగు అనే పేరుండేది. పెద్దయ్యాక పురుగు అనడం బాగుండదని పుస్తకాల పులి అనేవారు. ఎమ్మే క్లాసులో వాడూ రామసీతా ఒకరి ప్రతిభ ఒకరు గుర్తించుకున్నారు. వాడు బెర్ట్రాండ్— అంటే ఆమె "రస్సెల్" అనేది. వాడు డయలెక్టికల్ అంటే ఆమె మెటీరియనిజం అనేది. వాడు అభ్యుదయ అంటే ఆమె మెటీరియలిజం అనేది. వాడు అభ్యుదయం అంటే ఆమె భావాలు అనేది. వాడు సామాజిక అంటే ఆమె స్పృహ అనేది. అలా ఇద్దరి అభిరుచులూ, అంతస్థులూ ఒకటేనని తేలిపోవడంతో పెళ్లికూడా జరిగిపోయింది. వాళ్లకి ఇద్దరికీ ఒకే బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. ఇద్దరు పిల్లలు ఇప్పుడు.

వాళ్ల పెళ్లయిన కొత్తలో ఓసారి ఆహ్వానం లేకుండా వాళ్లింటికి వెళ్లాను నేను. ఆ ఊళ్లో నా పర్సుకి సరిపోయిన మంచిహోటల్ లేక వెళ్లేసరికి రాత్రి ఎనిమిది అయ్యింది. డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని

అలా రాత్రి పదకొండు అయ్యింది. వాళ్లు భోజనం మొదలు పెట్టలేదింకా. నేను రైలు దిగి వస్తూ దారిలో హోటల్‌లో భోజనం చేశాను కనుక సరిపోయింది! వాళ్లు తమ భోజనమే మరిచిపోయిన వాళ్లు నా సంగతిఎలా కనుక్కుంటారు? సురేష్‌కి నేనంటే చాలా ఇష్టం. గౌరవం చిన్నప్పట్నించీ, కానీ రష్యా చైనాల వైరం ముందు ఇవన్నీ ఎంత!

నేను ఎక్కణ్ణుంచో ఓ మడత మంచం మోసుకెళ్లి వరండాలోకి పట్టుకెళ్లాను. అక్కడ కటిక నేలమీద పడి నిద్రపోతున్న సురేష్ పిల్లలిద్దర్నీ చూసి నా హృదయంలో ఏదో కలుక్కుమంది ఇద్దర్నీ భుజాల మీద పడుకోబెట్టుకుని లోపలికి తెచ్చాను. అరే మీకెందుకండీ శ్రమ అంటూ రామసీత వచ్చి వాళ్లల్లో ఒకర్ని తనెత్తుకుని తీసుకెళ్లింది. పిల్లల్ని పడుకోబెట్టాక సురేష్ రామసీతా వడ్డించుకుని తిండిలో మూడు వంతులు వుంచేసి ఏదోతిని చేతులు కడుక్కున్నారు.



ఆ మర్నాడు వాళ్ల ఆతిథ్యం స్వీకరించాను నేను. వాళ్ళు ప్రపంచంలో అన్నీ చర్చిస్తారు. అది ప్లస్ పాయింట్ కాని— చాటున ఎవర్నీ నిందించకూడదని ఊరుకుంటున్నాను. వాళ్ల జీవితపద్ధతి నాకు నచ్చలేదు. ఇల్లంటే డిబేటింగ్ సొసైటీ కాదుగా. ఆ తర్వాత నేను వాళ్ల ఊరు వెళ్లినా వాళ్లింట్లో ఎప్పుడూ దిగలేదు. వాళ్ళు రెండు మూడుసార్లు మా ఇంటికి వచ్చినప్పుడు ఎంతో సరదాగా గడిపాం. వాళ్ళు అయిదు నిముషాలు మాట్లాడితే చాలు డజను జీవిత సమస్యలు అందులో దొర్లుతాయి. అలా స్ఫురించిన విషయాల మీద నేను పది కథలు రాసుకున్నాను. వాళ్లిద్దరూ కూడా ఎప్పట్నించో కథలు వ్రాయాలనుకుంటున్నారుట. కానీ వీలుపడటం లేదుట.

అయిదేళ్ల తర్వాత, ఎమ్మే రెండుసార్లు తప్పి మళ్లీ పరీక్షలకి వచ్చింది సునంద. ఓ రోజున రాత్రి టీ ఎంత తాగినా నిద్రరాక అటూఇటూ తిరుగుతూ "అన్నా భూషయ్య తాత ఎంత దుర్మార్గుడో చూశావా" అంది.

"ఏం చేశాడే?" అన్నాను నవ్వుతూ. మా చుట్టాల్లో భూషయ్యతాత అందర్లోకి పైకొచ్చిన వాడు. లక్షలు గడించాడు వ్యాపారంలో. అరవై ఏళ్లు నిండగానే షష్టిపూర్తి అన్నారు. గొప్పగా ఏర్పాట్లు చేశారు. తీరా ఆరోజు వచ్చేసరికి ఆయన కనపడలేదు. ఇది జరిగి పదేళ్లయ్యింది. ఈమధ్య ఆయన కొడుకుల దగ్గరికి వచ్చాడని తెలిసింది. ఇన్నాళ్లూ హిమాలయాల్లో తపస్సు చేసి కొన్నిసిద్ధులు కూడా పొందాడట.

భూషయ్యతాత ఆస్తివ్యవహారాలు ఆయన ఫ్రెండ్ చేతిలో పెట్టి వెళ్లాడా! ఉన్న ఆస్తి రెట్టింపయిందట పదేళ్లలోను. ముప్పై లక్షలు. అందులో ఓ లక్ష మన సురేష్‌కి ఇస్తానన్నాట్ట. మిగతాదంతా తన కొడుకులకీ కూతుళ్లకీనట. మనం ఎవరం కనపడలేదు ఆయనగారికి. సురేష్ ఒకడే గారాలకూచి అయ్యాడు. సురేష్ నాన్నగారు భూషయ్యతాత దగ్గర అప్పుపుచ్చుకుని ఎగేసిన పెద్ద మనిషి కదా. అయినా సురేషే దగ్గరయ్యాడు! అలాగే వుంటుంది జీవితం అని వాపోయింది సునంద.

"సురేష్ రామసీతల ఆదర్శ దాంపత్యాన్ని చూసి మురిపెంతో ఇచ్చాడేమోనే" అన్నాను నవ్వుతూ.

"అదీ నిజమేనేమో అన్నయ్యా! వాళ్లని చూస్తే ముచ్చటేస్తుంది. ఈ మధ్య వాళ్లని చూశావా నువ్వు?"

"లేదే"

"ఈమధ్య వాళ్ళు కొంచెం మారారు. ఎప్పుడూ పుస్తకాలలో విషయాలే మాట్లాడ్డం మానేసి, వాస్తవ ప్రపంచంలోకి వచ్చారు".

"మంచిదే. చదివీ చదివి విసుగేసి వుంటుంది. ఇప్పుడేం చేస్తున్నారు"

"సమాజంలో కుళ్లుని బయట పెడుతున్నారు"

"అంటే'

"చుట్టాల్లోనూ, ఫ్రెండ్స్‌లోనూ, పైవాళ్లలోను వున్నలోపాన్ని ఎత్తి చూపుతున్నారు. నేను మొన్న వెళ్లినప్పుడు రాజ్యం అత్తయ్య కొడుక్కు కట్నం తీసుకున్న విషయం తెలిసి ఎలా కడిగేశారో తెలుసా ఇద్దరూ! ఇద్దరిదీ ఒకటే మాటా ఒకే బాటా అన్నయ్యా! అలాగే వసంత వదిన అంత ఖాళీ వీలు వున్నా చదువుకోలేదని అన్నారు. నీకు ఉత్తరం రాస్తామన్నారు."

"ఓహో! సంఘ సంస్కరణలోకి దిగారన్నమా

మంచిదే" నవ్వాను.

"నీకు అన్నీ జోకులాగే వుంటాయి. నేను మూడు పిల్లల గొడవలున్నా ఎంత కష్టపడి ఎమ్మే చదువుతున్నానో."

"నిజమే. అయిదేళ్ళ చదివినా పూర్తవడంలేదు కష్టమే."

సునంద కొంచెం అవమానం ఫీలయి ఓ నిమిషం ఏమీ మాట్లాడలేదు. "ఎంతకష్టమో నీకేం తెలుసు. మా వారు ఏమీ హెల్ప్ చెయ్యరు."

"సురేష్ రామసీతా ఈ విషయం ఎత్తలేదా?

"మా వారికి ఉత్తరం రాస్తామన్నారు"

"వెరీగుడ్ ! వాళ్ల పిల్లలేం చదువుతున్నారు?"

"బాబు ఏడవ తరగతి పరీక్ష ఫేలయ్యాడు. పాప నాలుగో క్లాసు. అన్నట్లు సురేష్ సమగ్ర అభ్యుదయ విద్యావిధానం అని పుస్తకం రాస్తాట్ట అన్నయ్య. ఇప్పటి విద్యావిధానం బూజుపట్టిన వలసదారీ విధానాలకు అనువుగా వుందనీ, ఇది మారాలనీ రాస్తాట్ట."

"ఇంకా రాయలేదా? అలాంటి పుస్తకం రాస్తానని మూడేళ్ల క్రితం సుబ్బలక్ష్మి పెళ్లో నాకు చెప్పాడే"

"టైం వుండదన్నయ్యా... లక్ష పనులు వాళ్లకి అని. పరీక్షకని మళ్లీ పుస్తకం తీసి చదవసాగింది సునంద.

తర్వాత ఆర్నెల్లకి కాభోలు రామసీత మొగుణ్నీ పిల్లల్నీ వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. విడాకులు తప్పవేమోనంటూ నాకు ఉత్తరం వ్రాశాడు సురేష్.

మళ్లీ ఎమ్మే పరీక్షలు రాయడానికి వచ్చింది సునంద. వస్తూనే నన్ను కావలించుకుని ఏడవటం మొదలెట్టింది. ఏమిటోనని కంగారుపడి వచ్చిన వసంతని కూడా కావలించుకుని ఏడవసాగింది సునంద. దాన్ని ఎలాగో ఊరుకోబెట్టాం.

"ఏమిటే. ఏమైంది. నీ పరీక్ష గురించేనా దిగులు అందరికీ చెప్పి మార్కులు వేయిస్తాలే" అన్నాను.

"అది కాదన్నయ్యా సురేష్.."

"నేను విన్నాను. అసలేం జరిగింది."

భూషణం తాతయ్య వాళ్లింటికి వెళ్లాడు కదా క్రితం మేలో. అప్పుడే నన్నమాట లక్షరూపాయలు వాళ్లకిస్తానన్నది. కానీ ఓ షరతు పెట్టాడట. సురేష్ కానీ, రామసీత గానీ కలిసిగానీ, విడిగా కానీ ఎవర్నీ విమర్శించ కూడదని, తమ ఎదుట లేనప్పుడు పై వాళ్ల వ్యవహారాన్ని చర్చించకూడదని. ఎంత శత్రువులైనా పరోచాటు మంచి నిందించకూడదని. తనకి దివ్యదృష్టి వున్నదని వాళ్లు రూల్స్ ఏ మాత్రం అతిక్రమించినా తనకి తెలిసిపోతుందని అన్నాట్ట. ఓ దానికేముంది! మేం ఇతరులకు మేలేకాని కీడు ఎప్పుడూ తలపెట్టే రకం కాదుగా. చాలా సులువు అన్నారుట సురేష్, రామసీతా.

ఆ తర్వాత ఏమైందో ఆర్నెల్లు తిరక్కుండా రామసీత నాకీకాపురం వద్దు అంటూ పుట్టింటికి ఉడాయించింది. విడాకులిచ్చేస్తానంటున్నాడు సురేష్" అని వెక్కి వెక్కి ఏడిచింది సునంద.

ఆ రాత్రి నేను వసంతా పక్కపక్కన పడుకుని చాలా సేపు మాట్లాడుకున్నాం. సురేష్, రామసీతా ఎందుకలా అయివుంటారని అడిగింది వసంత.

"ఇదిగో అమ్మాయ్. నేను వాళ్లతో ఒక్కసారి కూడా ఈ విషయం మాట్లాడలేదు కదా. ఎందుకలా నా చేత తప్పులు మాట్లాడించాలని రెచ్చగొడతావు" అన్నాను.

"నీకు ఆ మాత్రం తెలివి వుందనుకున్నానోయ్ ఫిలా సిఫీ డాక్టరూ."

"నన్ను అనవసరంగా పొగడ్తలతో ఉబ్బేయకు, నీకు పుణ్యముంటుంది. నేనసలే ఉబ్బు లింగణ్ని.'

"గొప్ప" మూతి ముడుచుకుంది ఓ నిమిషం. మళ్లీ నావైపు తిరిగి "కొంచెం కూడా చెప్పవా" అంది గారంగా.

"చెప్తా" అని ఆమెని నా దగ్గరకులాక్కుని నువ్వు లోకంలో కెల్లా గొప్పదానివి. ఎందుకంటే నా పెళ్లానివి. నన్ను మనిషిని చేశావు కనుక నువ్వు దేవతవి. నాకు అన్నంలో ప్రేమ కలిపి తినిపించావు కనుక నా శరీరం సగం నీది. నీతో ఏం మాట్లాడినా వింటావు కనుక హేళనగా నవ్వవు కనుక నీ దగ్గర ఇష్టంవచ్చినట్లు మాట్లాడ్డంలో నా మనస్సు నాకు అర్థం అయ్యింది. అంచేత నువ్వే నా ఫ్రెండ్‌వి. నువ్విచ్చిన ఓపికతోనే నేను రీసెర్చి చేశాను కనుక నా డాక్టరేట్లలో ఒకటి నీది' అని ఆమె బుగ్గ కొరికాను. అంతదాకా సురేష్ సమస్య గురించి చెప్పబోతున్నానని, ఇదంతా దానికి ఉపోద్ఘాతం అనీ ఆశతో వుందేమో, నేను అసలు ఏమాత్రం చేయనని తేలిపోవడంతో కోపంవచ్చి నన్ను తనకి దూరంగా తోసెయ్యాలని విశ్వ ప్రయత్నం చేసింది వసంత. ఆ ప్రయత్నం విఫలమై నా గుండెలకు తల ఆనించి నిద్రపోయింది. నేనూ కొంతసేపయ్యాక నిద్రపోయాను.

ఆ తర్వాత కొన్నాళ్లకి సురేష్ నాకు రాజమండ్రి రైలు స్టేషన్‌లో కనపడ్డాడు. మాసినగెడ్డం వాడూను. ఏరా ఏమిటీ గొడవ? అన్నాను. వాడు నన్ను ఒక్కసారి ఎవరు అన్నట్లు చూసి, వెంటనే మెడ పైకెత్తి ప్రజావాహినికి విప్లవ సందేశం ఇస్తున్న ప్రజాకవి పోజులో నిలబడి ఆకాశంకేసి చూస్తూ రామసీతని ఇరవై నిమిషాలు తిట్టాడు ఏకబిగిని. అదో మహా ప్రవాహం. రామసీత మొగుణ్నీ పిల్లలనీ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందట. ఏ కోశానా ఆడతనం లేదట. అంత చదువుకున్నా అవగాహన లేదుట. ఇలా నిర్విరామంగా మాట్లాడాడు. అసలు ఆడవాళ్లని చెడగొట్టేది చదువేరా అన్నాయ్ అన్నాడు.

"ఛీ ఛీ.. చదువేం చేసింది? కాలేజీ చదువుల్లో అమ్మాయిలకి మొగుణ్ని ప్రేమించకు, పిల్లల్ని ప్రేమించకు అని చెప్పరుగా" అన్నాను.

"చెప్పరనుకో. ప్రేమించాలని చెప్తారా పోనీ?" సూటి ప్రశ్నవేశాడు. "పొగరు, గర్వం పెరిగిపోతాయి ఆడాళ్ళకి డిగ్రీలొచ్చేసరికి" అన్నాడు.

ఉడుకు మోత్తనం!.

నేను నవ్వేశాను వాడి ఉద్రేకం తగ్గించాలని.

"నీకు నవ్వులాటగానే వుంటుంది. నదిన కాలేజీల్లో చదువుకుంటే నీకు తెలిసేది.."

"ఓరి పిచ్చి సన్నాసి... చదువుకి మనుషుల తత్వం మార్చే సే శక్తేవుంటే ఈ పాటికి ప్రపంచం అంతా స్వర్గం అయివుండేదిరా. అది అసలు సమస్య కానేకాదు. మనిషి ఎదిగేది అనుభవం వల్ల అనుభవానికి విలువలు కట్టడానికీ, దాన్ని వాడుకోడానికీ చదువులూ, ఈ శాస్త్రాలు పనికొస్తాయి. ఇంతకీ రామసీత లోపం ఏమిటి?"

"భూషయ్య' తాత మాకు లక్ష రూపాయలిస్తానన్నాడు కదా. అంతదాకా ఏ గొడవలేదు మాకు. ఆయన మాకు డబ్బివ్వడానికి ఓ షరతు పెట్టాడు. మేం ఎవర్నీ చాటుగా నిందించకూడదనీ" వాడు రైలు కూతవేయడం గమనించి ఆపేశాడు సురేష్.

"తాతయ్య ఆ షరతు పెడితే మీకేమైంది?" రైలు కదుల్తోంది. సురేష్ పరుగెత్తికెళ్లి తన పెట్టే, పంచీ తెచ్చుకొచ్చి—

"ఏం అవాలి? మాకు మాట్లాడుకోడానికి ఒక్క మాట మిగల్లేదు. మూడు రోజులు మూగివాళ్లలా గడిపాం ఆ తర్వాత—" కదుల్తున్న రైలు ఎక్కేశాడు.

"తర్వాత చెప్తాలే" అని వాడంటుంటే రైలు వెళ్లిపోయింది.

నేను అలా వుండిపోయాను.

○



నీ పాత చీర.. పనిమనిషి కిచ్చావా..? మరా విషయం ముందే నాకెందుకు చెప్పలేదు.....!